కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -268 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 08-10-2026 గురువారం పేజీలు : 4



# విద్యుత్‌పై వార్ మాటల తూటాలు!

- డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోపై కీలక ప్రకటన
- 19,892 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- కోతలు లేకుండా విద్యుత్ సరఫరా
- హరీశ్‌రావు ఆరోపణలకు భట్టి కౌంటర్
- యాదాద్రి ప్లాంట్‌పై పాత సర్కార్‌పై విమర్శలు
- బొగ్గు కేటాయింపులపై భట్టి కీలక వ్యాఖ్యలు
- నైనీ బొగ్గు బ్లాక్‌పై ప్రభుత్వ వివరణ
- విద్యుత్ సంస్థలపై ముదిరిన రాజకీయ రగడ

**న్యూస్ డెస్క్, 07 అక్టోబర్ (బివిఎస్):** తెలంగాణలో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణపై జరుగుతున్న ప్రచారానికి డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క కీలక స్పష్టత ఇచ్చారు. డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని తేల్చి చెప్పారు. ఈ సంస్థలను లిస్టెడ్ కంపెనీలుగా మార్చే ప్రతిపాదన కూడా లేదన్నారు. రాజకీయ లబ్ధి కోసం కొందరు నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో పీక్ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని వెల్లడించారు. దాదాపు 20 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నప్పటికీ ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని చెప్పారు.

మిగతాది 2 లో..

# రెపో రేటు పెంపు.. ఈఎంఐల మోత!




**న్యూస్ డెస్క్, 07 అక్టోబర్ (బివిఎస్):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధాన కమిటీ సామాన్య రుణగ్రహీతలకు ఊహించని షాక్ ఇచ్చింది. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగిన ఎంపీసీ ద్వైమాసిక సమీక్షా సమావేశ నిర్ణయాలను బుధవారం ఉదయం వెల్లడించారు. మార్కెట్ వర్గాల అంచనాలకు అనుగుణంగా కీలక పాలసీ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచుతూ కమిటీ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది.

# బీజేపీ బూత్ ఏజెంట్‌పై క్రిమినల్ కేసు!




**న్యూస్ డెస్క్, 07 అక్టోబర్ (బివిఎస్):** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతున్న వేళ ఓట్ల తొలగింపు వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారం రేపింది. ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నకిలీ 'ఫామ్-7' దరఖాస్తులను ఉపయోగించి..

# పదవుల కోసం పాకులాడను

- బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు
- పార్టీ ఏ బాధ్యతైనా స్వీకరిస్తా
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- ఈసీపై విపక్షాల తీరుపై ఫైర్
- ఓట్ చోరీపై కాంగ్రెస్‌కు కౌంటర్
- ఎస్ఐఆర్ లక్ష్యాన్ని వివరించిన సంజయ్
- యువత మోసపోవద్దని పిలుపు




**న్యూస్ డెస్క్, 07 అక్టోబర్ (బివిఎస్):** కేసీఆర్ భూ వివాదాలపై చర్యలు కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే సోయి, దమ్ము కాంగ్రెస్ లేదని, కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలపై పోరాడే దమ్ము బీఆర్ఎస్‌కు లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలున్నాయని ఆరోపించారు. త్వరలో తెలంగాణ బీజేపీలో బండి సంజయ్ కి కీలక బాధ్యతలు అప్పగించబోతున్నారని ప్రచారం జరుగుతున్న వేళ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. నాకు బీజేపీ ఎన్నో పదవులు, అవకాశాలిచ్చిందని నేను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా శిరసావహిస్తానని కార్యకర్తగా పార్టీ కోసం పని చేస్తానన్నారు.

# భూకంపంతో ఉత్తరాది రాష్ట్రాల్లో టెన్షన్!



- ఉత్తరాఖండ్‌లో 4.4 తీవ్రతతో భూకంపం
- రాత్రివేళ ఒక్కసారిగా ప్రకంపనలు
- ఇళ్ల నుంచి బయటకు పరుగులు
- ఢిల్లీ-ఎన్‌సీఆర్ వరకు ప్రభావం
- పలు ఉత్తరాది రాష్ట్రాల్లో కంపనలు
- భయాందోళనకు గురైన ప్రజలు

2 లో

# రాహుల్, ప్రియాంకపై ఎఫ్ఐఆర్!




- ఈసీ కార్యాలయానికి విపక్ష ఎంపీల భారీ ర్యాలీ
- బారికేడ్ల వద్ద పోలీసులతో ఎంపీలకు వాగ్వాదం
- బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన రాహుల్ గాంధీ
- ఆకాశవాణి కార్యాలయంలోకి వెళ్లిన రాహుల్, ప్రియాంక
- రాత్రి వరకు కొనసాగిన హైడ్రామా.. ఎంపీల అదుపులోకి
- అనుమతి లేకుండా ప్రవేశించారంటూ పోలీసుల కేసు

# ఇందిరమ్మ చీరలు రెడీ!

- చిలుకపచ్చ రంగులో ఇందిరమ్మ చీరలు
- కోటి చీరల తయారీకి సన్నాహాలు
- ఇప్పటికే 45 లక్షల చీరలు చేరిక
- జిల్లాలకు చీరల రవాణా వేగవంతం
- నవంబర్ రెండో వారానికి లక్ష్యం
- నాణ్యత, డిజైన్‌పై ప్రత్యేక ఫోకస్
- చీరల కోసం రూ.300 కోట్ల ఖర్చు




**న్యూస్ డెస్క్, 07 అక్టోబర్ (బివిఎస్):** స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే ఇందిరా మహిళా శక్తి చీరలు జిల్లాలకు చేరుకుంటున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాల సభ్యులకు అందించేందుకు ప్రభుత్వం కోటి చీరలను తయారు చేయించింది. ఈ సారి చిలుక పచ్చ రంగులో చీరలను తయారు చేయించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల చీరలు జిల్లాలకు చేరాయి. పవర్ లూమ్ ద్వారా తయారు చేయిస్తున్న చీరలు ప్రాసెసింగ్ పూర్తి చేసి ప్యాకింగ్ చేసిన అనంతరం అధికారులు జిల్లాలకు చేరవేస్తున్నారు. మొదట దూరంగా ఉన్న జిల్లాలకు చీరలను రవాణా చేస్తున్నారు. మిగిలిన చీరలను అతి త్వరలో తయారు చేసి ప్రాసెసింగ్ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నవంబర్ రెండో వారం కల్లా కోటి చీరల తయారీ పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. దీంతో మిగిలిన చీరలను యుద్ధ ప్రాతిపదికన తయారు చేస్తున్నారు. మహిళలకు తాను అన్నగా అక్కలు, చెల్లెల్లకు చీరలు పెడుతున్నానని, ప్రభుత్వం అత్యంత నాణ్యమైన చీరలను అందిస్తుందని సీఎం పేర్కొన్నారు. పండగులు, ఫంక్షన్లు, సాధారణ రోజుల్లోనూ కట్టుకునే నాణ్యత, కలర్, డిజైన్, పట్టు అంచు ఉండేలా తయారు చేయిస్తున్నారు.

# దసరా వేళ ఉద్యోగులకు భారీ ఊరట!

- రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- ఏటా రూ.2,500 కోట్ల అదనపు భారం
- అక్టోబర్ జీతంతో పెరిగిన డీఏ
- నవంబర్ 1న ఖాతాల్లో జమ
- డీఏ బకాయిలు 33 వాయిదాల్లో
- జీపీఎఫ్‌లో బకాయిల జమ
- పెన్షనర్లకూ డీఏ పెంపు వర్తింపు

2 లో

# 140 కోట్ల ఆశీస్సులే నా బలం

- 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానం
- ప్రజల ఆశీస్సులే తన బలమన్న మోదీ
- భారత రాజ్యాంగానికి ప్రధాని ప్రణామం
- 140 కోట్ల ప్రజల కోసం ప్రార్థనలు
- సీఎం నుంచి ప్రధాని వరకు ప్రస్థానం
- వికసిత్ భారత్ 2047పై ప్రతిజ్ఞ



**న్యూస్ డెస్క్, 07 అక్టోబర్ (బివిఎస్):** ప్రజాప్రభుత్వ అధినేతగా పాతికేళ్ల నిరంతర పాలన ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన 'సేవా జ్యోతి' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొని భావోద్వేగంతో ప్రసంగించారు. ప్రజలకు సేవ చేసేందుకే దేశ ప్రజానీకం తనను నిరంతరం ఎన్నుకుంటూ వస్తోందని, ఈ అద్భుత ప్రజాస్వామ్యానికి, పవిత్ర భారత రాజ్యాంగానికి తాను ప్రణమిల్లుతున్నానని ప్రధాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సేవా జ్యోతి యాత్ర'లో పాల్గొంటున్న దేశ పౌరులందరికీ ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అంతకుముందు ఉదయాన్నే శ్రీ వినాయక మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసినట్లు గుర్తుచేసుకున్న మోడీ..

2 లో

# హీటెక్కుతున్న ఆస్తుల రాజకీయం

- హ్యుందాయ్ షోరూమ్‌ల వద్ద కలకలం
- గీతా హ్యుందాయ్ వాటాపై ప్రశ్నలు
- రూ.8,528 కోట్ల ప్రాజెక్ట్‌పై ఆరోపణలు
- '675 ఎకరాలు' అంటూ ఫ్లెక్సీల ఏర్పాటు
- సోషల్ మీడియాలో వైరల్‌గా ఫ్లెక్సీలు
- క్రిశాంక్ అరెస్టు.. బెయిల్‌పై విడుదల

2 లో

# ఎస్ఐఆర్‌పై రాహుల్ వైఖరిని ప్రశ్నించిన డీఎంకే

- మిళనాడు ఓట్ల తొలగింపుపై రాహుల్ మౌనం
- రాహుల్‌పై డీఎంకే తీవ్ర ఆగ్రహం
- ఎస్ఐఆర్ విషయంలో ద్వంద్వ వైఖరా?
- ఉత్తరాది అంశాలపైనే పోరాటమా?
- తమిళనాడు ఓట్లపై వైఖరేంటని ప్రశ్న
- ఓటర్ల హక్కులకు ప్రాంతాల వారీ న్యాయమా?
- కాంగ్రెస్-డీఎంకే మధ్య పెరిగిన విభేదాలు

2 లో

# పదవుల కోసం పాకులాడను

మొదటి పేజీ తరువాయి

మోడీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా నుండి హౌజింగ్ బోర్డు కాలనీ పడవ చౌరస్తా వరకు 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. ఈసీపై కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలపై మండిపడ్డారు.

ఓట్ చోరీ, సీట్ చోరీ పేటెంట్ రైట్స్ కాంగ్రెస్ కే:

ఓట్ చోరీ, సీట్ చోరీ పేటెంట్ రైట్స్ కాంగ్రెస్ పార్టీకే ఉన్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. దేశంలో మొట్టమొదటి ఓట్, సీట్ చోరీకి పాల్పడిన ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని ఆరోపించారు. 1946లో పీసీసీలన్నీ సర్దార్ పటేల్ ప్రధాని కావాలని ప్రతిపాదిస్తే కాంగ్రెస్ మాత్రం నెహ్రూను ప్రధాని చేసి ఓటు, సీటు చోరీకి పాల్పడిందని దుయ్యబట్టారు. దేశంలో పెద్ద ఎత్తున భోగస్ ఓట్లున్నాయని కాంగ్రెస్ చెప్పింది కదా ఆ ఓట్లన్నీ తొలగిస్తుంటే అభ్యంతరం ఎందుకు? అని ప్రశ్నించారు. ప్రధాని మోడీకి ఓట్, సీట్ చోరీకి పాల్పడాల్సిన కర్మ లేనేలేదని.. ఆయనకు కుటుంబమే లేదని, బ్యాంకు బ్యాలెన్స్, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు అవసరమే లేదన్నారు. ప్రధాని పదవి నుండి దిగిపోయిన వెంటనే జబ్బకు సంచి తగిలించుకుని సామాన్యుడిలా ప్రజా సేవలో తరించే మహనీయుడు మోడీ అని అభివర్ణించారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా మోడీ నిర్విరామంగా పనిచేస్తున్నారన్నారు.

జెన్ జీలారా.... వారి మాటలు నమ్మి మోసపోకండి:

కాంగ్రెస్ సహా కొన్ని రాజకీయ పార్టీలు చెబుతున్న మాటలు విని జెన్ జీలు మోసపోవద్దన్నారు. మోడీ రాజకీయ నేపథ్యం, చరిత్ర, ఆయన చేసిన సేవలను యువత గుర్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మోడీ లేని భారత్?ను ఊహించలేమని. స్వార్థం వీడి దేశం కోసం ఆలోచించండి. 2014కు ముందు... నేడు భారత్ ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన సంస్థ అని ఇదేమి బీజేపీ జేబు సంస్థ కాదన్నారు. ప్రజలంతా విచక్షణతో ఓట్లు వేస్తున్నారు కాబట్టే ప్రజాస్వామ్యం ఫరిఢవిల్లుతోందన్నారు. రాజ్యాంగ సంస్థను బదనాం చేస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకే పెను ప్రమాదం అని జ్ఞానేశ్ కుమార్ అంశం కోర్టులో తేల్చుకోవాలని విపక్షాలపై మండిపడ్డారు. రాజ్యాంగ సంస్థపై దాడి దుర్మార్గం అని అపాయింట్ మెంట్ తీసుకుని రాహుల్ గాంధీ ఈసీని ఎప్పుడైనా కలువొచ్చన్నారు. నిన్న ఈసీ అపాయిట్ మెంట్ ఎందుకు తీసుకోలేదు? వందల మందితో దాడికి వెళితే అడ్డుకోక ఏం చేస్తారు? అని ప్రశ్నించారు. అర్హుడైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాదు, అనర్హులను ఓట్ల జాబితా నుండి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యం అన్నారు. చనిపోయిన పీవీ నర్సింహారావు పేరు మొన్నటిదాకా ఓటర్ల జాబితాలో ఉందని 'సర్'తో ఆ ఓటును తొలగించారు అది కూడా తప్పేనా? అన్నారు. తెలంగాణలో 2014కు ముందు లక్షలాది మంది రోహింగ్యాలు, పాకిస్తాన్, బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులున్నారని ఒక్క మహేశ్వరం నియోజకవర్గంలోనే 30 వేలకుపైగా రోహింగ్యాల ఓట్లున్నాయన్నారు.

# దసరా వేళ ఉద్యోగులకు భారీ ఊరట!





న్యూస్ డెస్క్, 07 అక్టోబర్ (బిఎన్ఎస్): దసరా పండుగ వేళ తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త అందించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏలు (కరువు భత్యం) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో రెండు డీఏలు చెల్లించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. తాజాగా ఇందుకు సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ డీఏల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా సుమారు రూ.2,500 కోట్ల అదనపు భారం పడుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

డీఏ బకాయిలు ఇలా..

జనవరి 2024 నుంచి డీఏను 37.31 శాతానికి పెంచింది. అలాగే 2015 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 81.72 శాతానికి, 2020 పే స్కేల్ ఉద్యోగులకు 40.04 శాతానికి, 2016 పే స్కేల్ ఉద్యోగులకు 53 శాతానికి, 2006 పే స్కేల్ ఉద్యోగులకు 246 శాతానికి పెంచింది. యూజీసీ, ఏఐసీటీఈ పరిధిలోని ఉద్యోగులకు కూడా డీఏ పెంపు వర్తించనుంది. పెంచిన డీఏను అక్టోబర్ నెల జీతంతో కలిపి చెల్లించనున్నారు. నవంబర్ 1న ఉద్యోగుల ఖాతాల్లో పెంచిన డీఏ జమ కానుంది. డీఏ బకాయిలను ప్రభుత్వం 33 వాయిదాల్లో చెల్లించనుంది. జూలై 2024 డీఏ బకాయిలను 27 వాయిదాల్లో చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. డీఏ బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది.

# రెపో రేటు పెంపు..ఈఎంఐల మోత!

మొదటి పేజీ తరువాయి

దీంతో ఇప్పటివరకు 5.25 శాతంగా ఉన్న రెపో రేటు ఒక్కసారిగా 5.5 శాతానికి పెరిగింది. దేశంలో ఆహార, సేవా రంగాల్లో పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అంతర్జాతీయ ముడిచమురు మార్కెట్లో అస్థిరతలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువపై పడుతున్న ప్రభావాన్ని అడ్డుకునేందుకే వడ్డీ రేట్ల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు ఆర్బీఐ స్పష్టం చేసింది.

రెపో రేటు పెంపు ప్రభావం నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థపై పడనుంది. బ్యాంకులు ఆర్బీఐ నుంచి తీసుకునే రుణాలపై వడ్డీ పెరగనుండటంతో.. వాణిజ్య బ్యాంకులు కూడా తమ లెండింగ్ రేట్లను పెంచే అవకాశాలు ఉన్నాయి. ఫలితంగా ఇప్పటికే ఇళ్ల రుణాలు, వ్యక్తిగత, వాహన రుణాలు తీసుకున్న సామాన్యుల నెలవారీ ఈఎంఐల భారం మరింత పెరగనుంది. అలాగే కొత్తగా రుణాలు తీసుకోవాలనుకునే వారికి వడ్డీ రేట్లు ప్రియం కానున్నాయి. అయితే, మరోవైపు బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసుకునే డిపాజిటర్లకు, సీనియర్ సిటిజన్లకు మాత్రం వడ్డీ రేట్లు పెరిగి స్వల్ప ఊరట లభించనుంది. పండుగల సీజన్ ముంగిట ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచడం రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ రంగాలపై ఒకింత ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# బీజేపీ బూత్ ఏజెంట్‌పై క్రిమినల్ కేసు!

మొదటి పేజీ తరువాయి




30 మంది అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నించిన బీజేపీ బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ) ఎస్. బాలచందర్‌పై చిక్కడపల్లి పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. సెప్టెంబర్ 28న పోలింగ్ స్టేషన్ నం. 210 వద్ద బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్వో)కు ముందస్తుగా ముద్రించిన 30 ఫామ్-7 దరఖాస్తులను సమర్పించేందుకు బాలచందర్ ప్రయత్నించగా, అధికారులు వాటిని స్వీకరించేందుకు నిరాకరించారు.

తప్పుడు ధ్రువీకరణలు, నకిలీ సమాచారంతో ఓటర్ల తొలగింపుకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) జారీ చేసిన ఆదేశాల మేరకు ముషీరాబాద్ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో) టి. ప్రవీణ్ కుమార్ రెడ్డి పూర్తి న్యాయ సలహాలు తీసుకుని చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నిందితుడు బాలచందర్‌పై భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 217, 318(2)తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 లోని సెక్షన్ 31 కింద కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. రాష్ట్రంలో నకిలీ ఫామ్-7ల దుర్వినియోగంపై నమోదైన తొలి ఎఫ్ఐఆర్ కావడంతో పాటు, అధికార పార్టీ కాంగ్రెస్ దీనిపై తీవ్ర స్థాయిలో నిరసనలకు దిగుతుండటంతో ఈ పరిణామం బీజేపీని రాజకీయంగా తీవ్ర ఇరుకున పెట్టే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# రాహుల్, ప్రియాంకపై ఎఫ్ఐఆర్!



న్యూస్ డెస్క్, 07 అక్టోబర్ (బిఎన్ఎస్): ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఇండి కూటమి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన నిరసన ర్యాలీ విషయంలో కాంగ్రెస్ శ్రేణులగు బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు కీలక నేతలపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనుమతి లేకుండా ఆకాశవాణి కార్యాలయంలోకి బలవంతంగా ప్రవేశించారన్న ఆరోపణలపై అందిన ఫిర్యాదు ఆధారంగా ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు.

రాత్రి వరకు హైడ్రామా:

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ మంగళవారం విపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు నిన్న భారీ ర్యాలీ చేపట్టారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నేతృత్వంలో పెద్ద ఎత్తున విపక్ష ఎంపీలు ఈ మార్చ్ లో పాల్గొన్నారు. ఈ క్రమంలో నీతి ఆయోగ్ కార్యాలయం సమీపంలోకి రాగానే బారికేడ్లను ఏర్పాటు చేసి పోలీసులు ఎంపీలను అడ్డుకున్నారు. దాంతో వారు అక్కడే రోడ్డుపై బైఠాయించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ బారికేడ్లు ఎక్కి జాతీయ జెండాతో నిరసన తెలిపారు. విపక్ష ఎంపీలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలిస్తుండగా మిగతా ఎంపీలు అడ్డుకున్నారు. దీంతో అక్కడ తోపులాట, తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రాహుల్ గాంధీ, ప్రియాక గాంధీ సహా పలువురు ఎంపీలు పోలీసుల వలయాన్ని దాటుకుని ఆల్ ఇండియా రేడియో కార్యాలయం భవన ప్రాంగణంలోకి దూసుకుపోయారు. సీఈసీ రాజీనామా చేసే వరకు ఆకాశవాణి భవనం వీడేది లేదంటూ రాహుల్, ప్రియాంకతో పాటు కాంగ్రెస్ ఎంపీలు అక్కడే భీష్మించుకు కూర్చున్నారు. చివరకు రాత్రి 9 గంటల తర్వాత పోలీసులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ సహా పలువురు ఎంపీలను బలవంతంగా అదుపులోకి తీసుకుని రాత్రి 10 గంటలకు వాని విడిచిపెట్టారు.

# ఇందిరమ్మ చీరలు రెడీ!

మొదటి పేజీ తరువాయి

మహిళలు సీఎం సభలకు హాజరైనప్పుడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. దీంతో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల గురించి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. ఈ సారి చిలుక పచ్చ రంగులో చీరలను తయారు చేయించి ఇస్తున్నామని ప్రకటించారు.

పంపిణీ తేదీ ఖరారు కాగానే..

తయారు చేసిన చీరలను ఎప్పటి నుంచి పంపిణీ చేయాలనే దానిపై తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు చెబుతున్నారు. జిల్లాలకు వచ్చిన చీరలను గోడౌన్‌లలో భద్రపరుస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చీరల పంపిణీ తేదీ ఖరారు చేయగానే అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ చీరల కోసం దాదాపుగా రూ.300 కోట్ల వరకు వెచ్చిస్తున్నారు. ఒక వైపు పవర్ ?లూమ్ ?కార్మికులకు ఉపాధి కల్పించడం, మరో వైపు ఆడబిడ్డలకు చీరలు అందించడం రెండు లక్ష్యాలుగా ఈ చీరల పంపిణీ అనవాయితీ కొనసాగుతున్నది. గతంలో కంటే చీరలను పెంచి అందిస్తుండటంతో మహిళలు చీరలు కట్టుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. ఈ చీరలు వినియోగంలోకి వస్తున్నాయని, గతంలో వినియోగంలోకి రాలేదనే విమర్శలు సైతం ఉన్నాయి.

# ఎస్ఐఆర్‌పై రాహుల్ వైఖరిని ప్రశ్నించిన డీఎంకే





న్యూస్ డెస్క్, 07 అక్టోబర్ (బిఎన్ఎస్): కేంద్ర ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై దేశ రాజధాని ఢిల్లీలో గళమెత్తుతున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై 'ఇండియా' కూటమిలోని కీలక భాగస్వామి డీఎంకే తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. తమిళనాడులో ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపు జరిగిందని ఆరోపణలు వస్తున్నప్పటికీ.. దానిపై రాహుల్ గాంధీ ఎందుకు నోరు మెదపడం లేదని డీఎంకే అధికార ప్రతినిధి శరవణన్ అన్నాదురై ఘాటుగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్ లో తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ.. ఉత్తరాది రాష్ట్రాలు లేదా ఇతర ప్రాంతాల్లోని పరిణామాలపై రచ్చ చేసే రాహుల్ గాంధీ, తమిళనాడు విషయంలో మాత్రం ఉద్దేశపూర్వకంగా మౌనం వహించడం ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనమని మండిపడ్డారు.

ఒకవైపు ఎన్నికల కమిషన్‌పై వీధి పోరాటాలు చేస్తూ, మరోవైపు తమ మిత్రపక్ష రాష్ట్రమైన తమిళనాడులో భారీగా జరిగినట్లు చెబుతున్న ఓట్ల తొలగింపు వ్యవహారంపై కనీస వైఖరిని స్పష్టం చేయకపోవడం విడ్డూరంగా ఉందని డీఎంకే నేత ధ్వజమెత్తారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ అనేది ప్రాంతాన్ని బట్టి మారుతుందా అని నిలదీశారు. కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై 'ఇండియా' కూటమి ఐక్య పోరాటం సాగిస్తున్న తరుణంలోనే.. కూటమిలోని రెండు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, డీఎంకేల మధ్య ఈ తరహా విమర్శలు బహిర్గతం కావడం జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# హీటెక్కుతున్న ఆస్తుల రాజకీయం






న్యూస్ డెస్క్, 07 అక్టోబర్ (బిఎన్ఎస్): తెలంగాణలో ఆస్తుల రాజకీయం రచ్చ రేపుతోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ సభ్యులు ఆస్తులు వర్సెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆస్తులపై ఇరు పార్టీల మధ్య పొలిటికల్ వార్ పీక్స్ కు చేరుకుంది. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు వాటా ఉందని ఆరోపిస్తూ సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి ఎదుట ఫ్లెక్సీలు వెలిసిన సంగతి మరువక ముందే తాజాగా మరోసారి ఫ్లెక్సీలు కలకలం రేపుతున్నాయి. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి సతీమణికి వాటా ఉందంటూ హైదరాబాద్‌లోని గీతా హ్యుందాయ్ షోరూమ్‌ల ముందు ఫ్లెక్సీలు వెలిశారు. "675 ఎకరాలు.. రూ.8,528 కోట్ల హ్యుందాయ్ ప్రాజెక్ట్‌లో గీత హ్యుందాయ్ వాటా ఎంత?" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తూ ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 'అర్థమైందా రాజా ?' అంటూ సెటైరికల్ గా ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఫ్లెక్సీల ఆరోపణలు.. బీఆర్ఎస్ నేత అరెస్టు విడుదల:

కాగా సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి ఎదుట ఈనెల 4న సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులపై ఆరోపణలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారనే ఆరోపణలపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను పోలీసులు అరెస్టు చేయగా అతడికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో నిన్న క్రిశాంక్ విడుదలయ్యారు. ముఖ్యమంత్రి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వీటిని ఏర్పాటు చేశారంటూ బోయిన్‌పల్లి సర్కిల్-3 డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్ చేసిన ఫిర్యాదుతో క్రిశాంక్‌తోపాటు మరో ఆరుగురిపై గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేశారు. క్రిశాంక్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించి మంగళవారం కృష్ణానగర్‌కాలనీలోని ఆయన నివాసంలో అరెస్టు చేశారు. ఇప్పుడు హ్యుందాయ్ షోరామ్ ముందు ఫ్లెక్సీల విషయంలో పోలీసుల చర్యలు ఎలా ఉండబోతున్నాయనేది ఉత్కంఠగా మారింది.

# 140 కోట్ల ఆశీస్సులే నా బలం

మొదటి పేజీ తరువాయి



యావత్ దేశం కోసం, 140 కోట్ల మంది భారత ప్రజల సంక్షేమం కోసం సర్వశక్తిమంతుడైన భగవంతుడిని ప్రార్థించానని చెప్పారు. దేశ సేవ కోసం మరింత నూతనోత్సాహంతో, శక్తిసామర్థ్యాలతో పనిచేసే ఆశీస్సులను తనకు ప్రసాదించాలని భగవంతుడిని వేడుకున్నానని వెల్లడించారు.

వరుసగా 25 సంవత్సరాల పాటు ప్రభుత్వ అధినేతగా కొనసాగే అదృష్టం దక్కడం ప్రజల ఆశీర్వాదం వల్లే సాధ్యమైందని చెబుతూ, దేశ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తాను ప్రమాణస్వీకారం చేసిన నాటి రోజును గుర్తుచేసుకుంటూ.. తన ప్రజా జీవితంలో ఇంతటి సుదీర్ఘమైన, చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంటానని ఆనాడు కలలో కూడా ఊహించలేదని అన్నారు. సీఎం నుంచి ప్రధాని వరకు సాగిన ఈ ప్రస్థానంలో దేశ ప్రయోజనాలే పరమావధిగా అడుగులు వేశానని, 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధన దిశగా మరింత పట్టుదలతో ముందుకు సాగుతానని ఆయన పునరుద్ఘాటించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన 'సేవా జ్యోతి యాత్ర' సందర్భంగా ప్రధాని చేసిన ప్రసంగం సభలో హాజరైన వేలాది మంది కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపింది.

వి విల్ డూ ఇట్ అంటూ ప్రతిజ్ఞ

"2047 నాటికి వికసిత్ భారత్.. మనం సాధించి తీరుతాం! ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటాం! భారతదేశాన్ని ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా (గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్) నిలబెడతాం! భవిష్యత్తులో విశ్వక్రీడా వేదికైన ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వడంతో పాటు అంతరిక్ష రంగంలోనూ సరికొత్త శిఖరాలను అధిరోహిస్తాం!" అంటూ దేశ భవిష్యత్ లక్ష్యాలను ఆయన దిశానిర్దేశం చేశారు. భారతదేశం నేడు సరికొత్త ఆశయాలతో, దృఢ సంకల్పంతో ముందుకెళ్తోందని, 140 కోట్ల మంది పౌరుల సమష్టి భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రగతి సాధ్యమవుతోందని మోదీ పేర్కొన్నారు. యువతలోని సృజనాత్మకత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దేశాన్ని గ్లోబల్ పవర్‌హౌస్‌గా మార్చుతున్నాయని ప్రశంసించారు. గత పాతికేళ్ల తన ప్రజా పాలనలో దేశ ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యంగా పనిచేశానని, రానున్న రోజుల్లో మరింత రెట్టింపు ఉత్సాహంతో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిశలు శ్రమిస్తానని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ప్రసంగం సభకు హాజరైన ప్రతినిధులలో, యువతలో సరికొత్త జాతీయ భావాన్ని, సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

# భూకంపంతో ఉత్తరాది రాష్ట్రాల్లో టెన్షన్!

న్యూస్ డెస్క్, 07 అక్టోబర్ (బిఎన్ఎస్): ఉత్తరాఖండ్ రాష్ట్రంలో మంగళవారం రాత్రి భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 4.4గా నమోదైనట్లు సీస్మోలాజికల్ అధికారులు వెల్లడించారు. రాత్రి 10:30 గంటల సమయంలో భూమి తీవ్రంగా కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉత్తరాఖండ్‌లోని ఖాదున్ లగా గవాలి ప్రాంతానికి దాదాపు 22 కిలోమీటర్ల దూరంలో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు ప్రాథమిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. నిద్రపోయే వేళ హఠాత్తుగా భూమి ప్రకంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి వీధుల్లోకి పరుగులు తీశారు.

ఢిల్లీ-ఎన్‌సీఆర్ సహా పలు రాష్ట్రాల్లో కంపించిన భూమి

ఈ భూకంప ప్రభావం ఒక్క ఉత్తరాఖండ్‌కే పరిమితం కాకుండా పరిసర ఉత్తరాది రాష్ట్రాలకూ విస్తరించింది. జాతీయ రాజధాని ప్రాంతమైన ఢిల్లీ-ఎన్‌సీఆర్ తో పాటు హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో స్పష్టమైన ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బహుళ అంతస్తుల భవనాలు, ఇళ్లలోని ఫ్యాన్లు, వస్తువులు ఊగడంతో నివాసితులు కొద్దిసేపు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

అందని నష్టం వివరాలు.. విచారణ వేగవంతం

ఈ భూకంపం భూమిలో ఎంత లోతులో సంభవించిందనే వివరాలు తక్షణమే లభ్యం కాలేదని భూకంప శాస్త్రవేత్తలు తెలిపారు. భూకంపం కారణంగా ఎక్కడా ఆస్తి నష్టం లేదా ప్రాణనష్టం జరిగినట్లు ఇప్పటివరకు ఎలాంటి నివేదికలు అందలేదని అధికారులు వెల్లడించారు. ప్రకంపనల తీవ్రతకు సంబంధించిన పూర్తి వివరాలను, ఇతర గణాంకాలను సీస్మోలాజికల్ విభాగాలు సేకరిస్తున్నాయి. పరిస్థితులపై స్థానిక యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి.

# విద్యుత్‌పై వార్.. మాటల తూటాలు!

మొదటి పేజీ తరువాయి

ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, విద్యుత్ వినియోగం భారీగా పెరగడంతో డిమాండ్ ఈ స్థాయికి చేరిందని భట్టి విక్రమార్క వివరించారు. కర్ణాటకలో సుమారు 15 వేల మెగావాట్లు, ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 13 వేల మెగావాట్ల డిమాండ్ ఉండగా.. తెలంగాణలో విద్యుత్ వినియోగం మరింత ఎక్కువగా ఉందన్నారు. ఇంతటి డిమాండ్‌ను ఎదుర్కొంటూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్న జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటుపరం చేయడం లేదా వాటిని లిస్టెడ్ కంపెనీలుగా మార్చడం వంటి ఆలోచనలు రాష్ట్ర ప్రభుత్వానికి లేవని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బలమైన ప్రభుత్వ రంగ సంస్థలను కొనసాగించడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని చెప్పారు. విద్యుత్ రంగానికి సంబంధించిన ప్రభుత్వ సంస్థలను మరింత బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలను భట్టి విక్రమార్క ఖండించారు. 10 ఏళ్ల పాటు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఇలాంటి అంశాలపై బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు. విద్యుత్ సిబ్బందిని కించపరిచేలా రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు.

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క తీవ్ర విమర్శలు చేశారు. పవర్ ప్లాంట్ నిర్మించే ముందు దానికి అవసరమైన బొగ్గు లభ్యత, కేటాయింపులు, సరఫరా ఒప్పందాలను నిర్ధారించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. యాదాద్రి ప్లాంట్‌కు సింగరేణి నుంచి గ్రేడ్-9 బొగ్గు సరఫరా చేస్తామని గతంలో ఒప్పందం చేసుకున్నప్పటికీ.. అవసరమైన స్థాయిలో బొగ్గు సరఫరా జరగలేదని భట్టి ఆరోపించారు. అసలు బొగ్గు కేటాయింపులు లేకుండానే ప్లాంట్ నిర్మాణం చేపట్టారని విమర్శించారు.

స్టేజ్‌పై ఎమోషనల్ అయిన తమిళనాడు సీఎం విజయ్

నైనీ బొగ్గు బ్లాక్‌కు సంబంధించిన అంశాన్ని కూడా డిప్యూటీ సీఎం ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో మైనింగ్ ప్రక్రియ నిలిచిపోయిందని.. తాము కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించి మైనింగ్‌ను ప్రారంభించామని తెలిపారు. గత ఏడాది 2 యూనిట్లు, ఈ ఏడాది మరో 2 యూనిట్లను ప్రారంభించామని భట్టి విక్రమార్క చెప్పారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, పత్రాలను త్వరలో మీడియా ముందు ఉంచుతామని భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను ఆధారాలతో ప్రజలకు వివరిస్తామని చెప్పారు. వారానికి ఒక అంశం చొప్పున గత ప్రభుత్వ నిర్ణయాలను బయటపెడతామని పేర్కొన్నారు.

మరోవైపు.. విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరుతూ హరీశ్‌రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఇటీవల లేఖ రాశారు. ట్రాన్స్‌కోతో పాటు జెన్‌కో, డిస్కమ్‌లు, సింగరేణి వంటి కీలక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ట్రాన్స్‌కో రాష్ట్ర విద్యుత్ వ్యవస్థకు వెన్నెముక లాంటిదని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఐపీఓ పేరుతో సంస్థలో 26 శాతం వాటాను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ట్రాన్స్‌కోతో మొదలయ్యే ప్రక్రియ భవిష్యత్తులో జెన్‌కో, డిస్కమ్‌లు, సింగరేణికి కూడా విస్తరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్రంలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని చెబుతూ.. తెలంగాణలో మాత్రం అదే విధానాన్ని అవలంబిస్తే రాహుల్ గాంధీ స్పందించాలని హరీశ్‌రావు కోరారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు కూడా లేఖ ప్రతులను పంపినట్లు హరీశ్ రావు తెలిపారు.

ఇలా తెలంగాణలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరిన సమయంలోనే ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల భవిష్యత్తుపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఒకవైపు ప్రైవేటీకరణకు ఎలాంటి ప్రతిపాదన లేదని భట్టి విక్రమార్క స్పష్టం చేస్తుండగా.. మరోవైపు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను బీఆర్ఎస్ నేతలు అనుమానిస్తున్నారు. దీంతో డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కో భవిష్యత్తుపై రాజకీయ చర్చ మరింత వేడెక్కింది.

# విశేష ప్రజాదరణతో మార్మోగుతున్న 'సనాతన ధర్మ సహస్ర సూత్రాలు'!





రమణేశ్వరం: రమణేశ్వర దివ్యక్షేత్రంలో అట్టహాసంగా ఆవిష్కృతమైన 'సనాతన ధర్మ సహస్ర సూత్రాలు' గ్రంథం ఇప్పుడు ఆధ్యాత్మిక లోకంలో విశేష ప్రజాదరణ పొందుతోంది. జగద్గురువులు, పీఠాధిపతుల ఆశీస్సులతో సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారు లోకానికి అందించిన ఈ దివ్య గ్రంథం, ఆవిష్కరణ పూర్తయిన రెండు రోజుల్లోనే భక్తుల, ఆధ్యాత్మిక సాధకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. ప్రతి ఇంటా పారాయణ చేయదగిన గ్రంథంగా, నిత్య జీవితానికి మార్గదర్శిగా నిలుస్తూ నలుదిశలా ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలిస్తోంది.

సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారు ఎల్లప్పుడూ తమ శిష్యులు, భక్తుల యోగక్షేమాల గురించే ఆలోచిస్తారు. తమ శిష్యులు లౌకిక ఒత్తిళ్ల నుంచి విముక్తి పొంది, ఆధ్యాత్మిక మార్గంలో సులభంగా పురోగమించాలనే దివ్య సంకల్పంతోనే ఈ గ్రంథాన్ని రూపకల్పన చేశారు. వేద వేదాంగాలు, ఉపనిషత్తులలోని గూఢమైన సారాంశాన్ని 1008 సంస్కృత సూత్రాల రూపంలో అందిస్తూనే, సామాన్య శిష్యులకు సైతం అర్థమయ్యేలా స్వయంగా తెలుగు తాత్పర్యంతో పాటు వివరమైన వ్యాఖ్యానాన్ని జోడించడం వెనుక భక్తులపై గురువుగారికి ఉన్న అపారమైన వాత్సల్యమే ప్రధాన కారణం.

అంతేకాకుండా, భక్తులు మరియు సాధకులు ప్రశాంత వాతావరణంలో అంతర్ముఖ సాధన చేసుకోవడం కోసం సిద్ధగురువులు రమణేశ్వరం పుణ్యక్షేత్రాన్ని ఒక అద్భుతమైన దివ్యధామంగా తీర్చిదిద్దారు. కేవలం దర్శనానికే కాకుండా, ప్రతి సాధకుడు ఆత్మజ్ఞానాన్ని, దైవానుభూతిని పొందేలా ఈ క్షేత్రంలో అన్ని రకాల ఆధ్యాత్మిక సౌకర్యాలు, వసతులను భక్తుల కోసం సిద్ధం చేశారు. ఆత్మలోని దైవాన్ని దర్శించడమే ధర్మపు అసలైన సారమని, దానిని నిత్య జీవితంలో ఎలా అనుభవించాలో సిద్ధగురువులు అందించిన మార్గదర్శనం భక్తులకు కొండంత కొండంత అండగా నిలుస్తోంది.

గ్రంథంలో పొందుపరిచిన అమృత సూత్రాలు, ముఖ్యంగా మహర్షి గారు విశ్లేషించిన దివ్య మార్గాలు ప్రతిఒక్కరి ఆలోచనా దృక్పథాన్ని మార్చివేస్తున్నాయి. యంత్రపూరితమైన నేటి జీవనశైలిలో మానసిక ప్రశాంతతను, జీవన పరమార్థాన్ని వెతుక్కుంటున్న యువతకు, గృహస్థులకు ఈ 'సనాతన ధర్మ సహస్ర సూత్రాలు' ఒక సంజీవనిలా ఉపయోగపడుతున్నాయి. శిష్య లోకమంతా సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారి అమృత వాక్కులను పారాయణ చేస్తూ, వారు తీర్చిదిద్దిన రమణేశ్వర ధామంలో ఆత్మజ్ఞాన దీప్తిని పొందుతున్నారు.

# నీలం శివారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన నేదురుమల్లి



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):– నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలం చేల్లటూరు గ్రామపంచాయతీకి చెందిన వైఎస్ఆర్సిపి విలేజ్ సోషల్ మీడియా వింగ్ జనరల్ సెక్రెటరీ నీలం శివారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఇటీవల మరణించినారని తెలుసుకుని ఈరోజు వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి నీలం శివారెడ్డి గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట రాపూరు మండలాలకి చెందిన వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నెల్లూరు జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దందోలు లక్ష్మీనారాయణరెడ్డి,పొలంరెడ్డి పెంచలరెడ్డి తదితర వైకాపా నాయకులు,కార్యకర్త పాల్గొన్నారు.

# దసరా పండుగకు రేషన్ బియ్యం తోనే మమా... అనిపిస్తున్న "కూటమి ప్రభుత్వం"..!!

**ఈనెల రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు బియ్యం తోనే సరిపెట్టారు. మిగిలిన నిత్య అవసర సరుకులు ఇవ్వరా..?: రాజంపేట వైయస్ఆర్సిపి మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ...**

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 07: పేరు గొప్ప.. ఊరు దిబ్బ.. అనే చందంగా ఉంది కూటమి పార్టీల పాలన అంటూ.. కడప జిల్లా రాజంపేట వైఎస్ఆర్సిపి మహిళ అధ్యక్షులు మిరియాల సురేఖ ఎద్దేవా చేస్తూ... ఎన్నికల సమయంలో కూటమి నాయకులు వందల కొద్ది హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించారు. గెలిచి గద్దెను ఎక్కాక ప్రజలను వెన్నుపోటు పొడవడమే అలవాటు చేసుకున్నారు. సూపర్ సిక్స్ హామీలు పూర్తయ్యాయని మీటింగులు పెట్టి ఊదర గొట్టడం తప్పా పేద ప్రజల కోసం ఏమీ చేసింది లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని పెన్షన్ల పేరుతో ప్రజలను సచివాలయాలు చుట్టూ తిప్పుకున్నారే తప్ప కొత్త పెన్షన్లు ఇవ్వడానికి కాదు అంటూ కూటమి ప్రభుత్వంపై సురేఖ మండిపడ్డారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పే మాటలకు, వాస్తవాలకు ఎంతో దూరం ఉంది అంటూనే, ప్రజల నుండి ముక్కు పిండి వసూలు చేస్తున్న పన్నులు మీరు విమానాల్లో తిరగడానికి, మీటింగులు పెట్టుకోవటానికి, మీ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లకు జీతాలు ఇవ్వడానికి ఖర్చు ఖర్చు చేసు కుంటున్నారన్నారు. పేద ప్రజలకు రేషన్ షాపుల్లో కేవలం బియ్యం ఇచ్చి మమా.. అనిపిస్తున్నారు. హిందువులకు అతి పెద్ద పండుగ దసరా వస్తుంది అనే ఆలోచన కూడా లేకుండా కేవలం బియ్యం ఇచ్చి



మమా.. అనిపించడం పేదలకు ద్రోహం చేయడం కాదా అని కూటమి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు కరోనా సమయంలో సైతం బియ్యం, చక్కెర, కందిపప్పు, గోధుమపిండి వంటి నిత్యావసర సరుకులు ఇంటికి అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కు తుందన్నారు. కూటమి పార్టీలు పేద ప్రజల కోసం కాస్తయినా ఆలోచిస్తే బాగుండు అని ఎక్కడ చూసినా ప్రజలు చర్చించు చర్చించు కుంటు న్నారన్నారు. కాబట్టి ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజల కోసం, ప్రజల అవసరాల కోసం, పరిపాలన కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రాజంపేట వైఎస్ఆర్సిపి మహిళ అధ్యక్షురాలు మిరియాల సురేఖ తెలియజేశారు.

# బూర్గుపేట ఆశ్రమ పాఠశాల తనిఖీ

**- విద్యార్థుల విద్యా ప్రమాణాలపై పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ప్రత్యేక దృష్టి**

**- వసతులు, హాజరు, క్రమశిక్షణపై సమీక్ష**

**వెంకటాపూర్, ములుగు జిల్లా -- అక్టోబర్ 07,బిఎన్ఎస్:**




వెంకటాపూర్ మండలం బూర్గుపేటలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించి పాఠశాలలోని విద్యా పరిస్థితులు, విద్యార్థులకు అందుతున్న వసతి సౌకర్యాలను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన పీఓ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యసన స్థాయి, విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పరిశీలించి చదువుపై మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం డార్మిటరీ, పాఠశాల రికార్డులు, విద్యా సంబంధిత పుస్తకాలు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, ఆరోగ్యం, పరిశుభ్రత, క్రమశిక్షణ కల్పించడంపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల మెరుగుదల, ఆరోగ్యం, వసతి సౌకర్యాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు. విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

# రాయలసీమను లక్ష కోట్ల పెట్టుబడులతో హార్టికల్చర్ రంగాన్ని అభివృద్ధి చేస్తాం..!

**టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి..**




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 07: రాష్ట్రంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, కడప పట్టణంలోని బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అమరజీవి జల ధార ప్రొద్దుటూరు సభ విజయవంతం కావడం సంతోషకరమని తెలిపారు. రాష్ట్రంలో అమరజీవి జలధార కార్యక్రమం ద్వారా సుమారు రూ.30 వేల కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. సభ విజయవంతం కావడాన్ని జీర్ణించుకోలేక వైకాపా నేతలు విమర్శలు చేయడం సరికాదని భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి నిరోధకంగా సాగిందని భూపేష్ రెడ్డి విమర్శించారు. నేడు కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతుంటే వైకాపా నేతలు ఓర్వలేక విమర్శలు చేయడం వారి చేతకాని తనానికి నిదర్శనమన్నారు. కడప జిల్లా నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులు పనిచేసినప్పటికీ ప్రజలకు తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని భూపేష్ రెడ్డి విమర్శించారు. చేయని పనులను చేసినట్లుగా చెప్పుకోవడం వైకాపా నేతలకే చెల్లిందని అన్నారు. మిషన్ రాయలసీమ ద్వారా రాయలసీమ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతోందన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు, సెజ్‌ల అభివృద్ధితో పారిశ్రామిక రంగానికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. రాయలసీమలో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో హార్టికల్చర్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కడప జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగు తున్నాయని భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి కూటమి ప్రభుత్వం ప్రజల కోసం ముందుకు సాగు తోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఆధ్వర్యంలో సమష్టిగా పనిచేసి విజయం సాధిస్తామని భూపేష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు జయ సుబ్బారెడ్డి, బొమ్మిశెట్టి చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్, మీడియా కో ఆర్డినేటర్ జనార్దన్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ తది,తరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

**- అక్టోబర్ 17 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**- ప్రిన్సిపాల్ డాక్టర్ జి.స్వర్ణ కుమారి**

**బిఎన్ఎస్ ములుగు, అక్టోబర్ 07:**



పత్రికా ప్రచురణార్థం

తెలంగాణ ప్రభుత్వం

ప్రిన్సిపాల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, ములుగు , ములుగు జిల్లా, తెలంగాణ .

Rc.No. E1/133/GMC/MLG/2026/02-2026 తేది: 07-10-2026

కాంట్రాక్ట్ రిక్రూట్మెంట్ కొరకు నోటిఫికేషన్ విడుదల

అసిస్టెంట్ ప్రొఫెసర్-02 పోస్టులకు ఒప్పంద ప్రాతిపదికన 31.03.2027 వరకు లేదా అవసరం తీరినంత వరకు, ఏది ముందు అయితే అది వరకు పూర్తిగా ఒప్పంద ప్రాతిపదికన నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.

ములుగు లోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ & దాని అనుబంధ ఆసుపత్రిలో పెడియాట్రిక్ డిపార్ట్మెంట్ నందు పనిచేయడానికి G.O.R.T.No: 1276, ఫైనాన్స్ HRM (VII) తేది: 16.07.2026 ప్రకారం. తేది 12.10.2026 ఉదయం 11 గంటల నుండి 17.10.2026 మధ్యాహ్నం 2.00 గంటల వరకు వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయి మరియు వాక్ ఇన్ ఇంటర్వ్యూ తే : 30.10.2026 న నిర్వహించబడును.

మరిన్ని సమాచారం మరియు దరఖాస్తు కొరకు, అధికారిక వెబ్‌సైట్ https://gmcmulugu.org ను సందర్శించండి.

Dr G.Swarna Kumari
Principal
Government Medical College
Mulugu

ప్రభుత్వ వైద్య కళాశాల, దాని అనుబంధ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వైద్య విభాగంలో ఖాళీగా ఉన్న రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. స్వర్ణ కుమారి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 12వ తేదీ ఉదయం 11 గంటల నుంచి అక్టోబర్ 17వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. పోస్టుల భర్తీకి సంబంధించి అక్టోబర్ 30వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని, పోస్టులకు సంబంధించిన విద్యార్హతలు, అనుభవం, దరఖాస్తు విధానం, అవసరమైన ధ్రువపత్రాలు తదితర పూర్తి వివరాలను ప్రభుత్వ వైద్య కళాశాల అధికారిక వెబ్‌సైట్ స్త్రఎఎఎబశ్రీబస్త్రబ.శీతీస్త్రలో పరిశీలించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.స్వర్ణ కుమారి సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# రైతుల యొక్క భూ హక్కులకు భరోసా.. ప్రభుత్వ రాజముద్రతో పాస్ పుస్తకాల పంపిణీ: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి(బిఎన్ఎస్):– ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని అమ్మపాలెం గ్రామంలో నిర్వహించిన "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే గారు పంపిణీ చేశారు. రైతులకు వారి భూములపై హక్కులకు మరింత భరోసా కల్పించడంతో పాటు, భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని తెలిపారు. రైతులకు అవసరమైన ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం అభివృద్ధికే పరిమితం కాకుండా ప్రజా శ్రేయస్సును ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే గారు తెలిపారు. రైతులు, పేదలు, గ్రామీణ ప్రజల సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ప్రజలకు తమ భూములపై స్పష్టమైన హక్కులు కల్పించడం, భూ సంబంధిత సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే గారు అన్నారు. ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను అందుకోవడం ద్వారా రైతులకు తమ భూములపై మరింత భరోసా కలుగుతుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, పారదర్శకంగా అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి తెలుగుదేశం రూరల్ అధ్యక్షులు, మండల పి.ఏ. సి.యస్.అధ్యక్షులు, కూటమి నాయకులు, స్థానిక గ్రామ పెద్దలు, అధికారులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు, ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉంటా శాంతిభద్రతలే ప్రథమ ప్రాధాన్యం సీఐ మనోహర్

**పామిడి పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బి.మనోహర్ బాధ్యతల స్వీకరణ**

**బిఎన్ఎస్ న్యూస్ పామిడి**



పామిడి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బి. మనోహర్ బాధ్యతలు స్వీకరించారు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ బదిలీ కావడంతో ఆయన స్థానంలో నూతనంగా నియమితులైన బి. మనోహర్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా నూతన సీఐ మనోహర్ మాట్లాడుతూ పామిడి మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు పోలీస్ శాఖకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ బి. మనోహర్‌కు పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఈ నెల 11న మెగాస్టార్ చిరంజీవి కపిలేశ్వరపురం పర్యటన....

**సూర్య చారిటబుల్ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభోత్సవానికి హాజరు....**

**అభిమానులను ఉద్దేశించి ప్రసంగించనున్న పద్మవిభూషణ్ చిరంజీవి...**

కపిలేశ్వరం (బిఎన్ఎస్ )అక్టోబర్ 7: తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురంలో ఈ నెల 11వ ఆదివారం సినీ నటుడు, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత మెగాస్టార్ కొణిదెల చిరంజీవి పర్యటించనున్నారు. రాజమండ్రి జీఎస్ఎల్ హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్మించిన సూర్య చారిటబుల్ హెల్త్ కేర్ సెంటర్‌ను ఆయన చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించనున్నారు.నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 11న ఆదివారం ఉదయం 10.35 గంటలకు హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనే చిరంజీవి, అనంతరం ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించి వైద్య సేవలపై వివరాలు తెలుసుకోనున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రారంభం స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుందని నిర్వాహకులు పేర్కొన్నారు.అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు అభిమానులను ఉద్దేశించి చిరంజీవి ప్రత్యేకంగా ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా ఆయన సేవా కార్యక్రమాలు, ఆరోగ్య రంగ అభివృద్ధి, సమాజానికి అందించాల్సిన సేవలపై తన అభిప్రాయాలను పంచుకోనున్నట్లు సమాచారం.మెగాస్టార్ రాక సందర్భంగా అభిమాన సంఘాలు, నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చే అవకాశం ఉండటంతో భద్రతా చర్యలను కూడా కట్టుదిట్టం చేస్తున్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం చిరంజీవి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు......

# బీసీలకు అండగా తెలుగుదేశం పార్టీ

- శెట్టిబలిజలంతా టిడిపి విజయానికి కృషి చేయాలి
- రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు.



కొత్తపేట(బిఎన్ఎస్ )అక్టోబర్ 7 : బీసీలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అండగా నిలుస్తూనే వచ్చిందని రాజకీయంగా ఆర్థికంగా బలోపేతానికి పాటుపడిందని రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. బీసీలకు 34% ఉన్న రిజర్వేషన్లని గత వైసిపి ప్రభుత్వం 24% కుదించి బీసీలకు తీరని అన్యాయం చేసిందని దాని ఫలితంగా సుమారు 17 వేల మంది బీసీలు పదవులు కోల్పోయారని తెలిపారు.

దానిని పునరుద్ధించడానికి కూటమి ప్రభుత్వం విశేష కృషిచేస్తుందని సత్తిబాబు తెలిపారు. కొత్తపేట నియోజక వర్గం వానపల్లి గ్రామంలో శెట్టిబలిజ సామాజివర్గ నేతలతో కుడిపూడి సత్తిబాబు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కుడిపూడి మాట్లాడుతూ శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు..బోడసకుర్రు వంతెనకు దొమ్మేటి వెంకటరెడ్డి వారిదిగా నామకరణం చేస్తారని దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహ ఆవిష్కరణ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటిస్తారని తెలిపారు. బీసీ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన తనను సామాన్య కార్యకర్త స్థాయి నుండి రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గా పోలవరం జిల్లా పరిశీలముగా నియమించి శెట్టిబలిజ సామాజ వర్గానికి చెందిన వాడిగా తనకు గుర్తింపుచ్చినట్లు తెలిపారు. సామాజిక వర్గంలో ఎవరికి ఏ ఇబ్బంది కలిగినను ఎప్పుడూ ముందుంటానని వైద్య విషయంలో సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. శెట్టిబలిజ సామాజిక వర్గంలో చదువుకుంటున్న విద్యార్థుల వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సాహక ఆర్థిక సహాయం స్కాలర్ షిప్ అందిస్తున్నట్లు ఆయన చెప్పారు .అపద సమయంలోను ఎవరికైనా ఇబ్బంది కలిగినను తనను సంప్రదించవచ్చని ప్రభుత్వం వరంగా సహాయానికి కృషి చేస్తానని లేదా వ్యక్తిగతంగా తాను చేయగలిగిన సహాయము చేస్తానని భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్ల కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ కట్టబడి ఉందని న్యాయస్థానపరంగా ఉన్న ఇబ్బందులను అధికమించి చట్టబద్రత కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ కృషి చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు.

రానున్న స్థానిక సంస్థలు ఎన్నికలలో కూటమి పార్టీ అభ్యర్థుల విజయానికి శెట్టిబలిజలంతా ఐక్యంగా కృషి చేయాలని చైర్మన్ సత్తిబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రెడ్డి రామకృష్ణ గుబ్బల మూర్తి బొంతు గౌరీ శంకర్ కడలి బీమా దూనబోయిన నరసింహమూర్తి వనము పల్లంశెట్టి దూనబోయిన బుజ్జి, మట్టపర్తి రామారావు ఇళ్ళ రాము శీలం కొండబాబు ముసిని వెంకటరమణ దంగేటి సాయి కముజు వరప్రసాద్ కముజు శ్రీను రాయడు బాబీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలపై రైతుల నిరసన



బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బొగ్గులకుంట తండాలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పంటలను చూపిస్తూ నిరసన తెలిపారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పాటు బోర్లకు అవసరమైన విద్యుత్ అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 24 గంటల విద్యుత్ సరఫరా ఉండేదని, ప్రస్తుతం కనీసం 6--7 గంటల విద్యుత్ కూడా అందడం లేదని రైతులు విమర్శించారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కనీసం 15 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తక్కువ, ఎక్కువ వోల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో పాటు బోర్లు దెబ్బతింటున్నాయని తెలిపారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కాట్రోత్ రవీందర్ నాయక్, కోమటి చెరువు గ్రామపంచాయతీ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు కాట్రోత్ వావయిసింగ్, వార్డు సభ్యులు సక్రు నాయక్, పరింగన్ రూప్‌సింగ్, రైతులు టోపియా నాయక్, బలరాం, దేవి సింగ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### చింతలపూడి గురుకుల పాఠశాలలో

# తీరిన తాగునీటి ఎద్దడి

**స్పందించి బోరు వేయించిన ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్**



బిఎన్ఎస్ ,చింతలపూడి: చింతలపూడిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఇటీవల పాఠశాలలో తాగునీరు, సాధారణ అవసరాలకు నీటి సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పాఠశాల నిర్వహణ కమిటీ (రా.వీ.జ) బృందం స్థానిక చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ దృష్టికి తీసుకువెళ్ళింది. విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ వెంటనే స్పందించి, పాఠశాలలో బోరు వేయించడానికి తగిన చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే చొరవతో బుధవారం పాఠశాల ప్రాంగణంలో బోరు వేయించగా, అందులో 4 అంగుళాల పుష్కలంగా నీరు పడింది. దీంతో పాఠశాలలో వేధిస్తున్న సుదీర్ఘకాల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. తమ సమస్యపై తక్షణమే స్పందించి నీటి సమస్యను పరిష్కరించినందుకు గాను రావీజ కమిటీ సభ్యులు, ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు 500 మంది విద్యార్థులు శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేకాట స్థావరంపై దాడి

**ఆరుగురి అరెస్ట్, నగదు స్వాధీనం**



బిఎన్ఎస్: కామవరపుకోట మండలం చీపురుగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న ఒక పేకాట స్థావరంపై తడికలపూడి పోలీసులు ఆకస్మిక దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. జంగారెడ్డిగూడెం ఇన్స్పెక్టర్ ఎం.వి. సుభాష్ ఆదేశాల మేరకు, అందిన నమ్మదగిన సమాచారంతో తడికలపూడి మహిళా ఎస్ఐ వల్లి పద్మ తన సిబ్బందితో కలిసి బుధవారం (07.10.2026) ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడిలో జూదమాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు, వారి వద్ద నుంచి రూ. 3,200 నగదు, ఒక మోటార్ సైకిల్ మరియు ఐదు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి న్యాయపరమైన చర్యలు చేపట్టినట్లు మహిళా ఎస్ఐ వల్లి పద్మ తెలిపారు. జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తాయని, ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా పేకాట, జూదం లేదా ఇతర అక్రమ కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే డయల్-112 లేదా 9440796678 నంబరుకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# అధిష్ఠానం చూపు రాధమ్మ వైపు..

# అమలాపురం జనసేనలో వినిపిస్తున్న పేరు



అమలాపురం(బిఎన్ఎస్)అక్టోబర్ 7: అమలాపురం మున్సిపల్ రాజకీయాలు క్రమంగా వేడెక్కుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చైర్‌పర్సన్ పదవి ఏ వర్గానికి, ఏ కేటగిరీకి రిజర్వ్ అవుతుందన్న అంశంపై ఉత్కంఠ కొనసాగుతుండగా.. మరోవైపు ప్రధాన రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై అంతర్గత చర్చలు మొదలయ్యాయి.

ముఖ్యంగా చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు దక్కే అవకాశం ఏర్పడితే జనసేన పార్టీ నుంచి ఎవరిని బరిలోకి దింపాలన్న అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో జనసేనలో చాలాకాలంగా పనిచేస్తున్న బీసీ మహిళా నాయకురాలు బండి రాధమ్మ పేరు స్థానిక రాజకీయ వర్గాల్లో ప్రముఖంగా వినిపిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

### బీసీ మహిళా నాయకత్వానికి అవకాశం వస్తే?

అమలాపురం మున్సిపల్ రాజకీయాల్లో బీసీ వర్గాల ప్రాతినిధ్యం కీలక అంశంగా మారుతోంది. రిజర్వేషన్ బీసీ మహిళకు అనుకూలంగా ఖరారైతే.. పార్టీకి సామాజికంగా, రాజకీయంగా బలమైన అభ్యర్థిని ఎంపిక చేయాల్సిన అవసరం జనసేనపై ఉంటుంది.

ఈ నేపథ్యంలో బండి రాధమ్మ పేరు ముందుకు రావడానికి ఆమెకు ఉన్న స్థానిక పరిచయాలు, మహిళా వర్గాలతో అనుబంధం, పార్టీ కార్యకర్తలతో సమన్వయం, సామాజికంగా ఉన్న పరిచయాలు వంటి అంశాలు కారణాలుగా ఆమె అనుచరులు చెబుతున్నారు.

అంతేకాకుండా ఎన్నికల సమయంలో అభ్యర్థికి కేవలం పార్టీ గుర్తు మాత్రమే కాకుండా వ్యక్తిగత పరిచయం, ప్రజలతో సంబంధాలు, ఎన్నికల నిర్వహణ సామర్థ్యం కూడా కీలకంగా మారుతాయి. ఈ కోణంలో రాధమ్మకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఆమె వర్గాలు భావిస్తున్నాయి.

### పార్టీ ఆవిర్భావం నుంచి ప్రయాణం

జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యక్రమాల్లో కొనసాగుతూ.. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తున్న నాయకుల్లో రాధమ్మ కూడా ఒకరని ఆమె అనుచరులు చెబుతున్నారు.

పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన వారితో పోలిస్తే.. పార్టీ నిర్మాణ దశ నుంచే కార్యకర్తగా, నాయకురాలిగా పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలన్న చర్చ వస్తే రాధమ్మకు అది రాజకీయంగా అనుకూల అంశంగా మారే అవకాశం ఉందని వారు అంటున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థి ఎంపిక సమయంలో పార్టీ పట్ల దీర్ఘకాలిక విధేయత, కార్యకర్తలతో అనుబంధం, స్థానికంగా ఉన్న సామాజిక పరిచయాలను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుంది.

### ప్రజా పరిచయమే ప్రధాన బలం

రాజకీయాల్లో ఆర్థిక బలం ఒక్కటే ఎన్నికల విజయానికి సరిపోదు. ప్రజలతో నిరంతర సంబంధం, కార్యకర్తలతో సమన్వయం, స్థానిక సమస్యలపై స్పందించే విధానం కూడా ముఖ్యమే.

ఈ విషయంలో రాధమ్మకు స్థానికంగా మంచి పరిచయం ఉందని ఆమె అనుచరులు చెబుతున్నారు. మహిళలు, సాధారణ ప్రజలు, పార్టీ కార్యకర్తలతో నేరుగా మమేకమై ఉండటం ఆమెకు అదనపు బలంగా మారుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

ఆర్థిక స్థోమతతో పాటు ఎన్నికల సమయంలో అవసరమైన సంస్థాగత సహకారాన్ని సమీకరించే సామర్థ్యం కూడా ఒక అభ్యర్థికి అవసరమవుతుంది. ఈ రెండు అంశాల్లోనూ రాధమ్మకు అనుకూలత ఉందన్నది ఆమె వర్గాల వాదన.

### వైద్య సేవా కుటుంబం.. సామాజిక అనుబంధం

రాధమ్మ కుటుంబానికి వైద్య సేవా రంగంతో ఉన్న అనుబంధం కూడా ఆమెకు సామాజికంగా పరిచయాన్ని పెంచిన అంశంగా ఆమె అనుచరులు ప్రస్తావిస్తున్నారు.

ప్రజలకు వైద్య సేవలు అందించే కుటుంబంగా ఇప్పటికే అనేక వర్గాలతో పరిచయం ఉండటం.. అవసరమైన సందర్భాల్లో ప్రజలకు అందుబాటులో ఉండటం.. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి అంశాలు రాజకీయంగా కూడా ఉపయోగపడే అవకాశముందని వారు భావిస్తున్నారు.

రాజకీయ నాయకత్వానికి ప్రజా సేవా నేపథ్యం జోడైతే ప్రజల్లో విశ్వాసాన్ని పెంచే అవకాశం ఉంటుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

### పవన్ కళ్యాణ్ చర్చల్లో రాధమ్మ పేరు?

అమలాపురం మున్సిపల్ ఎన్నికలపై జనసేన అధినాయకత్వం స్థాయిలో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో.. అభ్యర్థుల ఎంపికలో స్థానికంగా బలమైన నాయకుల పేర్లు పరిశీలనకు వస్తున్నాయన్న ప్రచారం జరుగుతోంది.

ఈ క్రమంలో రాధమ్మ పేరు కూడా పార్టీ అంతర్గత చర్చల్లో వినిపిస్తోందన్న వార్త ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే అధినేత పవన్ కళ్యాణ్ స్వయంగా రాధమ్మ పేరును పరిశీలిస్తున్నారనే విషయంపై అధికారిక ధృవీకరణ లేకపోవడంతో.. దీనిని ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చగానే చూడాల్సి ఉంటుంది.

### రిజర్వేషన్ తేలితేనే అసలు చిత్రం

మొత్తం రాజకీయ సమీకరణాలకు అసలు దిశను నిర్ణయించేది చైర్‌పర్సన్ పదవికి తుది రిజర్వేషన్ ఖరారు.

బీసీ మహిళకు రిజర్వేషన్ వస్తే జనసేనలో ఆశావహుల సంఖ్య పెరగడం సహజం. అదే సమయంలో కూటమి రాజకీయ సమీకరణాలు, స్థానిక నాయకుల మధ్య సమన్వయం, పార్టీ అధిష్ఠానం నిర్ణయం, ఎన్నికల్లో గెలిచే సామర్థ్యం వంటి అంశాలు కూడా అభ్యర్థి ఎంపికలో కీలకంగా మారనున్నాయి.

అందువల్ల రాధమ్మ పేరు ప్రస్తుతం బలంగా వినిపిస్తున్నప్పటికీ.. తుది నిర్ణయం మాత్రం పార్టీ అధిష్ఠానం చేతుల్లోనే ఉంటుంది.

### రాధమ్మకు అవకాశం వస్తే?

బీసీ మహిళకు చైర్‌పర్సన్ పదవి దక్కే పరిస్థితి ఏర్పడి, జనసేన పార్టీ రాధమ్మను అభ్యర్థిగా ఎంపిక చేస్తే.. అది ఆమె రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపుగా మారే అవకాశం ఉంది.

పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్న రాజకీయ ప్రయాణం, మహిళా నాయకత్వం, బీసీ సామాజిక నేపథ్యం, స్థానిక ప్రజలతో పరిచయం, కార్యకర్తలతో అనుబంధం, కుటుంబానికి ఉన్న సామాజిక పరిచయాలు వంటి అంశాలు ఆమెకు అనుకూలంగా మారే అవకాశం ఉంది.

అయితే ఎన్నికల రాజకీయాల్లో చివరి వరకు ఏ సమీకరణమైనా మారవచ్చు. రిజర్వేషన్ ఖరారు, కూటమి నిర్ణయం, పార్టీ అంతర్గత సమీకరణాలు, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు, స్థానిక ప్రజాభిప్రాయం.. ఇవన్నీ కలిసి తుది ఫలితాన్ని నిర్ణయిస్తాయి.

అయినప్పటికీ.. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం బీసీ మహిళకు దక్కే పరిస్థితి వస్తే జనసేనలో బండి రాధమ్మ పేరు ప్రధానంగా పరిశీలనలోకి వస్తుందన్న చర్చ మాత్రం ప్రస్తుతం అమలాపురం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

అధిష్ఠానం నిర్ణయం ఏంటి? రిజర్వేషన్ ఎటు? రాధమ్మకు అవకాశం దక్కుతుందా? --- ఈ మూడు ప్రశ్నలకు సమాధానం కోసం అమలాపురం రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# చిన్నకొడప్గల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :కామారెడ్డి జిల్లా పిట్లం మండలం చిన్నకొడప్గల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ప్రారంభించారు. రైతులకు ధాన్యం విక్రయంలో ఇబ్బందులు లేకుండా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చికోటి మనోజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, నూతన పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, వార్డు సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.